సాక్షి నిజామాబాద్

బుధవారం । 8 । మే । 2024



సద్వినియోగం చేసుకోవాలి

వేసవి శిబిరాల్లో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న సూచించారు.

- IIలో ▸



వెలవెలబోతున్న ఎస్సారెస్పీ

నీటిమట్టం తగ్గిపోయి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వెలవెలబోతుంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 10.24 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
44.5 /30.5

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈదురు గాలుల బీభత్సం



విద్యుత్ తీగలపై పడిన బెలూన్

డొంకేశ్వర్/నిజామాబాద్ నాగారం: బలమైన ఈదురు గాలులు జిల్లాను వణికించాయి. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం పసుపు వర్ణంలోకి మారిపోయి ఈదురు గాలులు మొదలయ్యాయి. అక్కడక్కడా చిరుజల్లులు కూడా పడ్డాయి. దీంతో కొన్ని రోజులుగా ఎండ వేడికి ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. నాలుగైదు గంటల పాటు వీచిన బలమైన గాలులు దుమ్మురేపాయి. జిల్లా కేంద్రంలో ఆర్యనగర్‌లో ఒక బిల్డింగ్‌పై ఉన్న రాజకీయ పార్టీకి చెందిన ప్రచార బెలూన్ గాలికి ఉడిపోయి హై టెన్షన్ వైర్లకు చుట్టుకుంది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తీవ్రమైన గాలులకు జిల్లాలో అక్కడక్కడా చెట్లు పడిపోయాయి. కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తుగానే కరెంట్ సరఫరాను నిలిపివేశారు.

కొనసాగుతున్న కళాశాలల తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో అనుబంధ గుర్తింపు తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం నవీపేట్‌లోని మేధా డిగ్రీ కాలేజీ, బోధన్‌లోని ఉషోదయ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, విజయసాయి మహిళా డిగ్రీ కాలేజీ, ఎస్‌వీ, ఉషోదయ మహిళా డిగ్రీ కాలేజీ, ఎంఐఎంఎస్, ఇందూరు డిగ్రీ కళాశాలలు తనిఖీ చేసినట్లు వర్సిటీ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. విజయసాయి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో కనీసం టేబుల్స్ సైతం లేకపోవడంతో కాళ్లపైనే రిజిస్టర్లు పెట్టుకుని తనిఖీ చేయాల్సి రావడంతో అధికారులు అసహనానికి లోనయ్యారు. ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ, డీన్లు సీహెచ్ ఆరతి, రాంబాబు, లావణ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

మొదటి వారంలోనే పింఛన్ల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎప్పుడు నెలాఖరుకు వచ్చే పింఛన్ డబ్బులు ఇప్పుడు ముందుగానే వచ్చాయి. మార్చి పింఛన్‌ను ప్రస్తుతం మే మొదటి వారంలోనే పంపిణీ చేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి పింఛన్‌ను ఏప్రిల్ చివరి వారంలో అందజేసిన ప్రభుత్వం, పది రోజులు కూడా గడవక ముందే మార్చి నెలది పంపిణీ చేస్తోంది. దీంతో లబ్ధిదారులు పోస్టాఫీసుల ముందు క్యూ కడుతున్నారు.



కేసీఆర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న యువకుడు



రైతుకు పకోడీలు ఇస్తున్న కేసీఆర్



బాలుడికి..



కేసీఆర్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న కార్యకర్త



కేసీఆర్‌కు జ్ఞాపిక అందిస్తున్న బిగాల సోదరులు

సరదాగా కేసీఆర్

- పకోడీలు పంచిపెట్టిన కేసీఆర్
- ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద హోటల్‌లో టిఫిన్, టీ తీసుకున్న గులాబీ బాస్
- నిజామాబాద్‌లో నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బస్సుయాత్రలో భాగంగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వెళుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్దనున్న హోటల్‌లో ఆగారు. అక్కడ టిఫిన్ తిని టీ తాగారు. ఈ సందర్భంగా హోటల్ యజమాని వెంకటరమణయ్యతో మాట్లాడారు. ఉల్లిగడ్డ పకోడీలు తీసుకున్న కేసీఆర్ అక్కడ ఉన్న చిన్నారులకు తినిపించారు. తనను కలిసేందుకు వచ్చిన రైతులకు పకోడీలు ఇచ్చారు. హోటల్ వద్ద ఆగిన ప్రయాణికులు, చిన్నారులు కేసీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. వారందరితో కేసీఆర్ సంభాషణ సరదాగా నడిచింది.

నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు

సోమవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఇంట్లో కేసీఆర్ బస చేశారు. మంగళవారం సాయంత్రం కేసీఆర్ తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. వృద్ధులు, వికలాంగులు, ఉద్యమకాలంలో పనిచేసిన జర్నలిస్టులు, మేధావులు, న్యాయవాదులు, కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. వారి యోగక్షేమాలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. కాగా కేసీఆర్ ప్రభుత్వంలో దళిత బంధు పథకం పొందిన లబ్ధిదారులు కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన బాజిరెడ్డి కుటుంబం

నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మంగళవారం తన నివాసంలో వేదపండితుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు, పవిత్ర హోమ ద్రవ్యాలు, వేదపండితులతో కలిసి వచ్చిన బాజిరెడ్డి కుటుంబ సభ్యులు వాటిని కేసీఆర్‌కు అందించారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, ఆయన తమ్ముడు మహేష్ గుప్తా కేసీఆర్‌కు జ్ఞాపికను బహుకరించారు. కేసీఆర్ ఫొటోలు దిగుతున్న సమయంలో కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కేసీఆర్.. 'రాష్ట్రంలో కరెంటు అసలే పోతలేదు.. బీఆర్‌ఎస్ నేతలు అబద్ధాలు ఆడుతున్నారు'.. అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.



ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద పకోడీ తింటున్న మాజీ సీఎం కేసీఆర్, చిత్రంలో సురేశ్‌రెడ్డి, బాజిరెడ్డి

బీఆర్‌ఎస్‌లో నయా జోష్

- ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ పర్యటన విజయవంతంతో..
- రెండో రోజు కామారెడ్డిలో బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్
- జహీరాబాద్, నిజామాబాద్ గులాబీ శ్రేణుల్లో హుషారు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శాసనసభ ఎన్నికల్లో ఓటమి తర్వాత డీలాపడిన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కేసీఆర్ ఉమ్మడి జిల్లా పర్యటనతో ఉత్సాహం పెరిగింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గులాబీ దళపతి బస్సుయాత్ర సోమవారం నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఆర్మూర్, నిజామాబాద్ వరకు, మంగళవారం కామారెడ్డి జిల్లాలో సాగింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన అనంతరం కేసీఆర్ మొదటిసారి ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చారు. దారిపొడవునా కేసీఆర్‌కు ఘనస్వాగతం లభించింది. కార్నర్ సభలు విజయవంతం కాగా, జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గట్టి ఊపును కనబరుస్తున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉంది. జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌లు గులాబీ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. బలమైన మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వారైన వీరిద్దరూ సీనియర్ నాయకులు కావడంతో పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఈ రెండు స్థానాల్లోనూ త్రిముఖ పోరు నెలకొంది. దీంతో శక్తివంచన లేకుండా ఎన్నికల బరిలో కొట్లాడేందుకు సిద్ధమయ్యారు.

■ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సీట్లు, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బాన్సువాడ, జహీరాబాద్ శాసనసభ స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకుంది. భారీగా ఓట్లు సాధించిన నేపథ్యంలో ఎంపీ సీట్ల కోసం ఏమాత్రం తగ్గకుండా పోరాడాలని గులాబీ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నాయి.



నిజామాబాద్‌లో కేసీఆర్‌ను కలిసేందుకు వచ్చిన జనాలు

■ బీఆర్‌ఎస్ అధినేతగా తాను బస్సు యాత్రకు దిగితేనే రేవంత్ ప్రభుత్వం రైతుభరోసా డబ్బులను విడుదల చేసిందని, మన దెబ్బకు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టిన దెయ్యం వదిలిందని చేసిన వ్యాఖ్యల ద్వారా శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు కేసీఆర్ ప్రయత్నించారు. ఇక రైతు రుణమాఫీ రావాలన్నా, కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కావాలన్నా బీఆర్‌ఎస్ పోరాటమే శరణ్యమని అన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఉద్యమ పార్టీ అధినేత కేసీఆర్ నొక్కి మరీ చెప్పారు. ఇదే ఊపుతో తమ సత్తా చాటుతామని నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికైన తమకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన ఉద్యమకారులు కోరుతున్నారు.

ఊపునిచ్చిన కేసీఆర్ ప్రసంగం

బస్సుయాత్రలో కేసీఆర్ ప్రసంగం బీఆర్‌ఎస్ శ్రేణులకు బూస్ట్ నిచ్చింది. ఉమ్మడి ఇందూరు జిల్లా గులాబీ అడ్డా అని, జిల్లాను తన గుండెల్లో పెట్టుకున్నానని కేసీఆర్ చెప్పిన మాటలు ఉర్రూతలూగించాయి. తాను గులాబీ జెండా ఎత్తినప్పుడు నా వెంట నిలిచి జిల్లా ప్రజా పరిషత్‌ను గెలిపించింది ఉమ్మడి ఇందూరు జిల్లానేనన్నారు. తద్వారా ఉద్యమాన్ని ఇందూరు జిల్లా ఆకాశానికెత్తిందన్నారు. తన ప్రాణమున్నంత వరకు ఇందూరు గడ్డను మరువనని కేసీఆర్ అన్న మాటలు పార్టీ నాయకులు, కార్యకర్తలకు తిరుగులేని ఉత్సాహాన్ని ఇచ్చాయనడంలో సందేహం లేదని పలువురు స్పష్టం చేస్తున్నారు.

కామారెడ్డి ఉండన్నా.. పోవన్నా?

- జిల్లాను రద్దు చేస్తారట!
- రాష్ట్రంలో అసమర్థుల చేతుల్లో రాజ్యం
- మోదీ పాలనలో దేశ ఆర్థికస్థితి ఛిన్నాభిన్నం
- రోడ్ షోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతున్న కేసీఆర్

సాక్షి, కామారెడ్డి: 'ఒక్క మాట చెప్పాలె! కామారెడ్డి జిల్లా ఉండన్నా.. పోవన్నా.. తీసేస్త అంటుండ్రు.. కాపాడుకుంటరా.. పోగొట్టుకుంటరా? మీ ఇష్టం'' అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం రాత్రి కామారెడ్డిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో అన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం కామారెడ్డి జిల్లాను ఏర్పాటు చేసుకున్నామని, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలను తీసేస్తా అంటుంటే చూస్తూ ఊరుకుందామా అని ప్రశ్నించారు. దీంతో ప్రజలు జిల్లా ఉండాల్సిందేనని నినాదాలు చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్నా, కామారెడ్డి జిల్లాను కాపాడుకోవాలన్నా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని, పార్టీ గాలి అనిల్‌కుమార్‌కు మెజారిటీ ఇవ్వాలని కేసీఆర్ కోరారు. జిల్లా రద్దు చేస్తారట అన్న కేసీఆర్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది.

అలస్యంగా ప్రారంభం

షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 5 గంటలకు కామారెడ్డికి చేరుకోవాల్సిన కేసీఆర్ బస్సుయాత్ర.. రాత్రి 7.25 గంటలకు చేరుకుంది. నిజాంసాగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన రోడ్ షో రైల్వే బ్రిడ్జి, స్టేషన్ రోడ్డు, ఇందిరా చౌక్, సిరిసిల్లా రోడ్డు, జీవీఎస్ రోడ్డు మీదు గా జేపీఎన్ కూడలి వరకు సాగింది. మెదక్‌లో నిర్వహించే సభలో పాల్గొనాల్సి ఉండడంతో కేసీఆర్ ఇతర నేతలకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నేరుగా మైక్ అందుకుని ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో అసమర్థులు, తెలివితక్కువ వారి చేతుల్లో రాజ్యం ఉందన్నారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమైందని, రూపాయి విలువ పడిపోయి అంతర్జాతీయంగా ప్రతిష్ట దెబ్బతిందని విమర్శించారు. రోడ్‌షోలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి కామారెడ్డికి వచ్చిన కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు.



కామారెడ్డి రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవడం ఖాయం

- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: రాష్ట్రంలో మహిళలు, రైతులు, యువకులను మోసం చేసి సీఎం రేవంత్‌రెడ్డి గద్దెనెక్కారని, వారందరి ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని గోల్‌హనుమాన్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలుచేయకుండా రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బీడీ కార్మికుల కోసం 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని అమిత్ షా ఇటీవల ప్రకటించారని గుర్తుచేశారు. లక్కంపల్లి సెజ్‌లో వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగాలు సృష్టిస్తామన్నారు. నిజామాబాద్‌ను స్మార్ట్‌సిటీగా చేస్తానని హామీనిచ్చారు. జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతామన్నారు. మధురలో కృష్ణుడి మందిరం నిర్మిస్తామన్నారు. సీఏఏను దేశమంతా అమలు చేస్తామని స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అందుకోసం మే 13న కమలం గుర్తుకు ఓటేసి మోదీని బలపర్చాలని కోరారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కార్పొరేటర్లు న్యాలం రాజు, బంటు వైష్ణవి, పంచరెడ్డి లింగం పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి

ప్రచార పర్వం

రైతులను మభ్యపెట్టేలా అమిత్‌షా వ్యాఖ్యలు

- ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రైతులను మభ్యపెట్టేలా ఉన్నాయని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. చక్కర కర్మాగారం సహకార రంగంలో ప్రారంభిస్తామని అమిత్‌షా వెల్లడించడంతో వారి నిజ రూపం బయటపడిందన్నారు. సహకార రంగంలో ప్రారంభిస్తే నిర్వహణ భారం రైతులపై పడుతుందన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు విషయంలో బీజేపీ రైతులను మభ్యపెడుతుందన్నారు. స్వామినాథన్ సిఫారుసులకు అనుగుణంగా మద్దతు ధర కల్పించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. ఆర్మూర్‌లో బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యే సీఎం రేవంత్ రెడ్డి రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఎంపీపీ పస్క నర్సయ్య, నాయకులు సంజయ్ సింగ్ బబ్లూ, అయ్యప్ప శ్రీనివాస్, మారుతి రెడ్డి, పండిత్ పవన్, కొంతం మురళీధర్, భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

అదనపు ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి సంబంధించిన అదనపు ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో అదనపు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, వారి తరపున ప్రతినిధులు పాల్గొన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ జిల్లాలో గల ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ అసెంబ్లీ సెగ్మెంట్ల సెకండ్ ర్యాండమైజేషన్ సోమవారం పూర్తయ్యింది. కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కమిషనింగ్ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తిన ఈవీఎంల స్థానంలో అదనంగా కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు మంగళవారం రెండో విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ పాల్గొన్నారు.

సీఎం రోడ్‌షోకు భారీ బందోబస్తు



ఖలీల్‌వాడి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నిజామాబాద్ నగరం, ఆర్మూర్‌లో పర్యటించనున్నారు. సీఎం పర్యటనకు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలో 300 మందికి పైగా సిబ్బంది సీఎం రోడ్‌షో తోపాటు కార్నర్ మీటింగ్ వద్ద బందోబస్తులో పాల్గొంటారని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు కోరారు. నగరంలో రాత్రి 7:30 గంటలకు ముఖ్యమంత్రి రోడ్ షో తోపాటు కార్నర్ మీటింగ్ ఉంటుందని చెప్పారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని సీపీ కల్మేశ్వర్ తెలిపారు.

- పూలాంగ్ చౌరస్తా నుంచి నగరంలోనికి వచ్చే వాహనాదారులు ఆర్ ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా, బోధన్ బస్టాండ్ మీదుగా గాంధీ చౌక్ వరకు చేరుకోవచ్చు.
- కంఠేశ్వర్ వైపు నుంచి వచ్చే వాహనాదారులు ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, ఫ్లై ఓవర్ నుంచి బస్టాండ్‌కు చేరుకోవాలి.
- బోధన్ వైపు నుంచి రాకపోకలు సాగించే వాహనాలు అర్సపల్లి రైల్వే గేటు మీదుగా కొత్త కలెక్టరేట్ వైపు నుంచి ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా, శివాజీ చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు రావాలి.
- హైదరాబాద్ నుంచి వచ్చి పోయే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్, ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా మీదుగా రాకపోకలు సాగించాలి.
- ఆర్మూర్ రాకపోకలు సాగించే వాహనదారలు కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్ వైపు నుంచి ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా, శివాజీ చౌరస్తా మీదుగా వెళ్లాలి.
- బాన్సువాడ వైపు నుంచి వచ్చి, పోయే వాహనాలను వర్ని చౌరస్తా నుంచి ఖిల్లా చౌరస్తా, బోధన్ బస్టాండ్, అర్సపల్లి రైల్వే గేటు మీదుగా కొత్త కలెక్టరేట్ వైపు నుంచి ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా, శివాజీ చౌరస్తా మీదుగా మళ్లిస్తారు.

రూట్ మ్యాప్ వివరాలు

ఆర్మూర్‌లోని ఆలూర్ బైపాస్, జమ్మన్‌జట్టి గల్లీ, గోల్‌బంగ్లా, పాత బస్టాండ్ మీదుగా రోడ్ షో సాగుతోంది. అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. నగరంలోని గోల్ హనుమాన్ చౌరస్తా, ఆర్యసమాజ్, బడా బజార్, అజం రోడ్, పోస్ట్ ఆఫీస్ మీదుగా రోడ్ షోలో పాల్గొనున్న సీఎం నెహ్రూ పార్క్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతారు.

క్లుప్తంగా

‘ప్రేరణ’కు జ్యోతీబా పూలే విద్యార్థిని భవిజ్ఞ



భిక్కనూరు : దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే ప్రేరణ కార్యక్రమానికి భిక్కనూరు మండలం జంగంపల్లి మహాత్మాజ్యోతీబా పూలే పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థిని భవిజ్ఞ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ మణిదీప్తి మంగళవారం తెలిపారు. గుజరాత్‌లో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే ఈ ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా అనేక రకాల పరీక్షలను నిర్వహించి 20 మందిని ఎంపిక చేశారన్నారు. ఈ 20 మందిలో మన రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికవ్వగా అందులో జంగంపల్లి జ్యోతీబా పూలే పాఠశాలకు చెందిన భవిజ్ఞ ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని భవిజ్ఞను ప్రిన్సిపాల్‌ మణిదీప్తి, ఉపాధ్యాయులు రాధిక, పావని, సుప్రియ, గంగసాగర్‌, లావణ్య, పర్హా అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: ‘తెలంగాణ రత్న తెలంగాణ కీర్తి, ప్రైడ్‌ ఆఫ్‌ తెలంగాణ అవార్డులను అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్‌ ది బెస్ట్‌ ఆర్ట్స్‌’ అకాడమీ(సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్‌ఎస్‌ నారాయణ మాస్టారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారులకు వారి ప్రతిభ, సేవలను గుర్తించి పురస్కారం అందజేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా ఆల్‌ ది బెస్ట్‌ అకాడమీ, ఇంటినెంబర్‌ 1–20–164, గోకుల్‌నగర్‌, వెంకటాపురం, పోస్టు: తిరుమలగిరి, సికింద్రాబాద్‌–15కు పంపాలని, పూర్తి వివరాల కోసం 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సౌకర్యాలు కల్పించండి



నిజామాబాద్‌అర్బన్‌: ఎన్నికల సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్‌ కోరారు. ఈమేరకు మంగళవారం వారు నగరంలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. రికార్డు స్థాయిలో ఎండలు ఉండడంతో పోలింగ్‌ బూత్‌లలో కూలర్లను ఏర్పాటుచేయలన్నారు. చల్లని నీరు, బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు.

టీచింగ్‌ డాక్టర్స్‌ అసోసియేషన్‌ ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ టీచింగ్‌ డాక్టర్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్‌ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే డాక్టర్‌ కిరణ్‌మాదాల ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కిరణ్‌ బోల్లేపాక, కోశాధికారిగా డాక్టర్‌ ఎల్‌ రమేశ్‌, ఉపాధ్యక్షులుగా సుమలత, ప్రకాశ్‌ ఎన్నికయ్యారు.

వెలవెలబోతున్న ‘వరప్రదాయిని’

- కనిష్ట స్థాయికి ఎస్సారెస్పీ నీటిమట్టం
- గతేడాది నిల్వ ఉన్న నీరు 21.74 టీఎంసీలు..
- ఈ ఏడాది 10.24 టీఎంసీలు

ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా చెప్పుకునే శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు నీటిమట్టం తగ్గిపోయి వెలవెలబోతోంది. గతేడాది ఇదే నెలలో 21.74 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ ఏడాది కేవలం 10.24 టీఎంసీలు ఉంది. 2019 తరువాత ఈ స్థాయికి నీటి మట్టం పడిపోవడం ఇదే తొలిసారి.



నీరులేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సగానికి పడిపోయింది. యాసంగి పంటలకు వరద కాలువ ద్వారా దిగువకు నీటిని విడుదల చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రాజెక్ట్‌లో ఇదేరోజున 21.74 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుత సంవత్సరం 10.24 టీఎంసీలు నిల్వ ఉంది. అంటే సగానికంటే ఎక్కువే తేడా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుందని ప్రాజెక్ట్‌ అధికారులు అంచనాలు వస్తూ గోదావరిలోకి 62 టీఎంసీల నీటిని వదిలారు. కానీ ఒక్కసారిగా ఎగువ ప్రాంతాల నుంచి వరద నిలిచిపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గిపోయింది. యాసంగి పంటలు గట్టెక్కుతాయో లేదోనని అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ పంటలు గట్టెక్కాయి. ప్రస్తుతం తాగు నీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నారు.

వరద రాకుంటే తిప్పలు తప్పవు

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి వచ్చే ఖరీఫ్‌లో సకాలంలో వరద రాకుంటే తాగు నీటికి సైతం తిప్పలు తప్పేలా కనిపించడం లేదు. ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిలో 5టీఎంసీలు డెడ్‌ స్టోరేజ్‌, మరో రెండు టీఎంసీలు ఆవిరి రూపంలో పోతే మిగిలేది 3 టీఎంసీలు మాత్రమే. కానీ తాగు నీటి అవసరాల కోసం ప్రాజెక్టులో 5 టీఎంసీల నీరు నిల్వ ఉండాలి. ఎగువ పాతాల నుంచి సకాలంలో వరద రాకున్నా, వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా తాగునీటికి కటకట తప్పేలా లేదు. ఉన్న నీటిలో ప్రతి నీటిచుక్కను సద్వినియోగం చేసినా ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రాజెక్టులో 2019 తరువాత కనిష్ట స్థాయికి నీటి మట్టం తగ్గడం ఇదే తొలిసారి. 2019లో ప్రాజెక్టులో నీటి నిల్వ 9 టీఎంసీలకు పడిపోయింది.అంతకు ముందు 2015లో ఎగువ ప్రాంతాల నుంచి చుక్క నీరు రాకపోవడంతో డెడ్‌స్టోరేజీ దిగువకు పడిపోయింది. ఆ తరువాత 2019లో 9 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుత సంవత్సరం కూడా ఖరీఫ్‌ ప్రారంభం నాటికి నీటి నిల్వ గణనీయం గాపడే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి 1056.3(10.24 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

ఇక్కడ చెల్లనిది అక్కడ చెల్లుతోంది



రూ.పది, ఇరవై నాణేలు



కామారెడ్డిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్డు

- రూ.10, 20 నాణేలు తీసుకోని వ్యాపారులు, ప్రజలు
- మహారాష్ట్రలో చలామణి అవుతున్నా ఇక్కడ నిరాకరణ

కామారెడ్డి అర్బన్‌: గుగుల్‌పే, ఫోన్‌ పే వంటి ఆన్‌లైన్‌ చెల్లింపులతో చిల్లర సమస్య కొద్దివరకు తీరినప్పటికీ కూరగాయలు, కిరాణాషాపుల్లో పరిస్థితి అలాగే ఉంది. చిల్లర సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.1, 2, 5, 10, 20 నాణేలను విరివిగా మార్కెట్‌లోకి విడుదల చేస్తోంది. అయితే కామారెడ్డిలో అనేక మంది రూ.10, 20 నాణేలను తిరస్కరిస్తున్నారు. బ్యాంకులు వ్యాపారులకు నాణేలను నిర్బంధంగా ఇస్తుండగా.. దుకాణాల్లోకి వస్తున్న వినియోగదారులు మాత్రం వ్యాపారుల నుంచి రూ.10, 20 నాణేలు తీసుకోవడం లేదు. తమ వద్ద జమైన వేలాది రూపాయల 10, 20 నాణేలను మహారాష్ట్రకు వెళ్లి మార్పిడి చేయాల్సి వచ్చిందని పలువురు వ్యాపారులు వాపోయారు. మహారాష్ట్రలో చలామణిలో ఉన్న రూ.10, 20 నాణేలు ఇక్కడ తిరస్కరిస్తుండడం విచారకరమని, బ్యాంకు అధికారులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరుతున్నారు. గతంలో రిజర్వ్‌ బ్యాంకు ఆఫ్‌ ఇండియా రూ.10 నాణేల చెల్లుబాటు విషయంలో ప్రకటన చేసినప్పటికీ ప్రజలు, వ్యాపారుల్లో మార్పు రావడం లేదని అంటున్నారు. ఇక బ్యాంకుల్లో సైతం రూ.10 నాణేలు పదికంటే ఎక్కువ డిపాజిట్‌గా తీసుకోవడం లేదని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతోనే పరిస్థితి ఇలా ఉందని భావించిన పట్టణంలోని కొత్త బస్టాండ్‌ వద్ద కిరాణదుకాణం నడిపే పప్పుల శ్రీకాంత్‌ ఏకంగా బోర్డు ఏర్పాటు చేశారు. రూ.10, రూ.20 నాణేలను తాము తీసుకుంటామని, అలాగే చిల్లర అవసరమైనప్పుడు ఇస్తామని ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేశారు.

“సమస్యను పరిష్కరించాలి



చిల్లర సమస్యపై ప్రభుత్వం ప్రజలను చైతన్యం చేయాలి. మహారాష్ట్రలో రూ.10, 20 నాణేల చలామణిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. తెలంగాణలోనే సమస్య ఎక్కువగా ఉంది. మా దుకాణానికి వచ్చే వినియోగదారులకు చిల్లర ఇవ్వడంతోపాటు చిల్లర తీసుకుంటామని అవగాహన కల్పిస్తూ బోర్డు ఏర్పాటు చేశాం. ఇలాగే పట్టణంలోని అన్ని దుకాణాల్లోనూ ఏర్పాటు చేస్తే ప్రజల్లో చైతన్యం వస్తుంది. చిల్లర సమస్య పరిష్కారమవుతుంది.

–పప్పుల శ్రీకాంత్‌, కిరాణావ్యాపారి, కామారెడ్డి

కేసీఆర్‌ బస్సుపై పూలవర్షం



మాజీ సీఎం కేసీఆర్‌ బస్సుపై పూలు చల్లేందుకు వేచి చూస్తున్న మహిళలు



బస్సుపై పూలు చల్లుతున్న బీఆర్‌ఎస్‌ శ్రేణులు

డిచ్‌పల్లి: పార్లమెంట్‌ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌ నుంచి కామారెడ్డికి వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు డిచ్‌పల్లి వద్ద బీఆర్‌ఎస్‌ పార్టీ శ్రేణులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం డిచ్‌పల్లికి కేసీఆర్‌ ప్రయాణిస్తున్న ప్రత్యేక బస్సు చేరుకోగానే నాగాపూర్‌ గేట్‌ వద్ద బస్సుపై మహిళలు, పార్టీ నాయకులు పూల వర్షం కురిపించారు. బస్సులో నుంచే కేసీఆర్‌ పార్టీ శ్రేణులకు చేశారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులతో డిస్ట్రిక్ట్‌ స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ ముత్తన్న

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణను సద్వినియోగం చేసుకొని క్రీడాపోటీల్లో రాణించాలని జిల్లా యూత్‌, స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ ముత్తన్న సూచించారు. మండలంలోని మిట్టపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా యూత్‌, స్పోర్ట్స్‌ అథారిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి సాఫ్ట్‌బాల్‌ శిక్షణ శిబిరాన్ని మంగళవారం సాయంత్రం ముత్తన్న సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడాపరికరాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్‌ అథారిటీ కబడ్డీ కోచ్‌ ప్రశాంత్‌, సురేశ్‌, శిక్షణ శిబిరం కోచ్‌ మర్కంటి గంగామోహన్‌, కోచ్‌ హెచ్‌ అనికేత్‌, సీనియర్‌ క్రీడాకారులు సెంథిల్‌, అంజలి, గంగాధర్‌, వినయ్‌, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాధీనంలోనే షుగర్‌ ఫ్యాక్టరీలను నడిపిస్తాం

- హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- సాలూర, పెగడాపల్లి సభల్లో కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



సాలూరలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



ప్రచార సభకు హాజరైన మహిళలు

బోధన్‌: ప్రభుత్వాధీనంలోనే నిజాంషుగర్‌ ఫ్యాక్టరీలను పునఃప్రారంభించి నడిపిస్తామని ఎమ్మెల్సీ, కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వ పరంగా బోధన్‌ షుగర్‌ ఫ్యాక్టరీతోపాటు ముత్యంపేట, ముంబోజిపల్లి ఫ్యాక్టరీలను 2025 డిసెంబర్‌ వరకు తెరిపించి క్రషింగ్‌ ప్రారంభించే బాధ్యత కాంగ్రెస్‌ ప్రభుత్వానిదేనన్నారు. సాలూర మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంతంలో, పెగడాపల్లిలో మంగళవారం కాంగ్రెస్‌ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచార సభలు నిర్వహించగా, మహిళలు, యువకులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, పంట రుణాలను ఆగస్టు 15వ తేదీ వరకు మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. గృహ అవసరాలకు 200యూనిట్ల వరకు విద్యుత్‌, రూ.500 గ్యాస్‌ సిలిండర్‌ అందిస్తున్నామన్నారు. గల్ఫ్‌కార్మికుల సమస్యలను బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పట్టించుకోలేదని విమర్శించారు. గల్ఫ్‌ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలంటే పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని రైతులను కోరారు. జీవితంలో చివరి అంకంలో ఉన్నానని, ఆశీర్వదించి గెలిపిస్తే కడుపులో పెట్టుకొని చూసుకుంటానని అన్నారు.

బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్‌ పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలకు అన్యాయం చేశాయని, మళ్లీ ఓట్ల కోసం వస్తున్న ఆ పార్టీలను నమ్మొద్దని అన్నారు. కాంగ్రెస్‌ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే నిరుద్యోగ యువతకు 30 వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మూతపడిన షుగర్‌ ఫ్యాక్టరీ తెరిపించేందుకు ఫ్యాక్టరీల బ్యాంకు అప్పులు తీర్చేందుకు రూ.43 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మరో 140 కోట్ల వరకు అప్పు ఉందన్నారు. గతంలో తన హయాంలోనే సాలూర గ్రామానికి ఎత్తిపోతల పథకం మంజూరు చేసి, ఈ ప్రాంత భూములకు సాగునీరందించానన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హందాన్‌, కాంగ్రెస్‌ జిల్లా, మండల నాయకులు గంగాశంకర్‌, అల్లె రమేశ్‌, నరేందర్‌రెడ్డి, మందర్న రవి, నాగేశ్వర్‌రావు, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ గౌసొద్దీన్‌, సొసైటీ చైర్మన్‌ అల్లె జనార్దన్‌, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఐడియా అదిరింది..!



ఎండ తగలకుండా బైక్‌కు ఏర్పాటు చేసిన రక్షణ కవచం

మద్నూర్‌(జుక్కల్‌): వేసవి ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. బయటకు వెళ్లి పనులు చేసుకుందామంటే ఎండ తీవ్రతకు ఆరోగ్యం దెబ్బతింటోంది. బైక్‌ మీద ప్రయాణం చేస్తే వడగాలుల దెబ్బకు చలి మంట ముందు కూర్చున్నట్లు ఉంటోంది. దీంతో బైక్‌కు రక్షణ కవచం ఏర్పాటు చేసుకోని ఎండలో కూడా హాయిగా తన పనులు చేసుకుంటున్నాడు హన్మంత్‌. వివరాలు.. డోంగ్లీ మండలంలోని దోతి గ్రామానికి చెందిన హన్మంత్‌ తన బైక్‌కు హైదరాబాద్‌లో రూ.7,500 ఖర్చు పెట్టి రక్షణ కవచం ఏర్పాటు చేయించారు. ఎండ, వడగాలులు కూడా తగలకుండా హాయిగా ప్రయాణం చేయొచ్చని ఆయన చెప్పారు. మంగళవారం మద్నూర్‌లో హన్మంత్‌ తన బైక్‌పై వెళ్తుండగా సాక్షి క్లిక్‌ మనిపించింది.

క్రైం కార్నర్‌

గడ్డివాము దగ్ధం



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం మిర్దాపల్లిలో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుంది. సమీపంలోని వ్యవసాయభూమిలో వరికొయ్యలకు నిప్పుపెట్టగా, గాలిదుమారానికి మంటలు వేగంగా వ్యాపించి సమీపంలో రైతులు నిల్వ చేసి ఎండుగడ్డికి అంటుకున్నాయి. రైతుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారని అగ్నిమాపకశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు.

ఆస్పత్రుల్లో మానసిక వైద్యసేవలు



రామారెడ్డి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానసిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా మానసిక వైద్య నిపుణులు రమణ అన్నారు. వైద్య సిబ్బంది మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని కామారెడ్డి జిల్లా మానసిక వైద్య నిపుణులు డాక్టర్‌ రమణ పిలుపునిచ్చారు. రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బందికి మంగళవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సమాజంలో మానసిక అనారోగ్య కారణం చేత చాలామంది అవగాహన లేమితో ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ప్రత్యేక చికిత్స ద్వారా, కౌన్సెలింగ్‌తో నయం చేయవచ్చన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా జిల్లా ఆస్పత్రి కామారెడ్డిలో ప్రత్యేక చికిత్స, ఉచిత మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య సామాజిక కార్యకర్త వంగ రాహుల్‌ కుమార్‌, రామారెడ్డి వైద్యాధికారి సురేష్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ భీం, సూపర్‌ వైజర్‌ జానకి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తల్లి.. బెంగతో కూతురు మృతి

- బాన్సువాడ మండలం బోర్లంలో ఘటన
- ఒకేచోట తల్లీకూతుళ్ల అంత్యక్రియలు



చోటీ బీ (ఫైల్‌)



రజియా బీ (ఫైల్‌)

బాన్సువాడ రూరల్‌: తల్లి చనిపోయిందనే బెంగతో 12గంటల వ్యవధిలో కూతురు మృతి చెందిన ఘటన బాన్సువాడ మండలం బోర్లంలో చోటుచేసుకుంది. తల్లీకూతుళ్ల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోర్లం గ్రామానికి చెందిన కాటేపల్లి చోటీ బీ(80) గత కొంతకాలంగా బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వరకాలనీలో చిన్నకూతురు రజియా బీ(60) వద్ద ఉంటోంది. అనారోగ్యంతో బాధపడుతున్న చోటీ బీ సోమవారం రాత్రి 11గంటలకు మృతి చెందగా, కూతురు రజియా బోరున విలపిస్తూ సొమ్మసిల్లి పడిపోవడంతో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం చోటీ బీ మృతదేహాన్ని బోర్లంకు తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా తల్లి మృతదేహం వద్ద రజియా బీ రోదిస్తూ అస్వస్థతకు గురై మృతి చెందింది. తల్లీకూతుళ్ల అంత్యక్రియలను మంగళవారం సాయంత్రం ఒకేసారి నిర్వహించారు.

పరిస్థితి విషమించి యువకుడు..



ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మండలంలోని కళ్యాణి గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జగదీశ్‌(32) గత గురువారం కామారెడ్డి నుంచి బైక్‌పై కళ్యాణికి వస్తుండగా లింగంపేట మండలం ముస్తాపూర్‌ గ్రామశివారులో అడవిపందులు అడ్డువచ్చాయి. ఈ ఘటనలో బైక్‌ అదుపు తప్పి జగదీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడాది కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వాగులో పడి వృద్ధురాలు..

నవీపేట: మాక్లూర్‌ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జిట్టవేణి అబ్బాయి(62) మండలంలోని జన్నేపల్లి వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ మంగళవారం తెలిపారు. అబ్బాయికి మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 6వ తేదీన రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. మంగళవారం సాయంత్రం అబ్బాయి వాగులో శవమై కనిపించింది. మృతురాలి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

త్వరగా నిద్రలేవమన్నందుకు చెరువులో దూకి ఆత్మహత్య

రెంజల్‌(బోధన్‌): ఉదయం త్వరగా నిద్రలేవాలని భర్త మందలించడంతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గాజ సాయిలు, గాజ లావణ్య(36) భార్యాభర్తలు. ప్రతి రోజూ ఉదయం లావణ్య ఆలస్యంగా నిద్రలేస్తుండడంతో భర్త మందలించేవాడు. మంగళవారం కూడా లావణ్య ఆలస్యంగా నిద్రలేవడంతో సాయిలు మందలించాడు. దీంతో క్షణికావేశంలో లావణ్య ఇంట్లో నుంచి బయటికి వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లి విడిచివెళ్లిపోయిందని యువకుడు..

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): తండ్రి మృతి చెందగా, తల్లి తనను విడిచివెళ్లిపోయిందని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మల్లయ్యపల్లి గ్రామ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భిక్కనూర్‌ గ్రామానికి చెందిన బేస్త కృష్ణ (20) గొర్రెలు మేపేందుకు మంగళవారం ఉదయం మల్లయ్యపల్లి శివారుకు వెళ్లాడు. అయితే, కృష్ణ తండ్రి గతంలో మృతి చెందగా, తల్లి సైతం అతడిని వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జీవితంపై విరక్తితో ఉన్న కృష్ణ మంగళవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్దనాన్న బీరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.